
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 13 । జూలై । 2023



పెదవాగు.. పనుల్లో జాగు

పెదవాగు ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. 10లో



.. ముడుపుల మాయ !

భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఉత్సవమూర్తులకు అర్చకులు స్నపన తిరుమంజనం కమనీయంగా జరిపారు. ప్రతి బుధవారం స్వామివారికి బేడా మండపంలో ఈ వేడుక నిర్వహిస్తారు. తెల్ల వారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

పంటల నమోదు పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు



రోళ్లపాడులో పంటల నమోదును పరిశీలిస్తున్న అభిమన్యుడు

టేకులపల్లి: పంటల నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అభిమన్యుడు అన్నారు. మండలంలోని రోళ్లపాడు, బేతంపూడి, కోయగూడెం, బద్దుతండాలో బుధవారం ఆయన పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి ఏయే పంటలు వేశారనే వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేశారు. లాభసాటి, ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పంటల నమోదులో ఏఈ, ఏఈఓలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంటల ఎంపికలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు బి.సాయినారాయణ, నీరుడు అన్నపూర్ణ, విశాల, శ్రావణి పాల్గొన్నారు.

జిల్లా అటవీ శాఖాధికారిగా కిష్టాగౌడ్




జిల్లాకు రానున్న కిష్టాగౌడ్

చుంచుపల్లి: జిల్లా అటవీ శాఖ అధికారిగా వెయిటింగ్‌లో ఉన్న కిష్టాగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీఎఫ్‌ఓ లక్ష్మణ్ రంజిత్ నాయక్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థకు బదిలీ చేసింది. 2020లో డీఎఫ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన రంజిత్ నాయక్ సిబ్బందితో సమన్వయంగా వ్యవహరిస్తూ అటవీ శాఖలో తనదైన ముద్ర వేసుకున్నారు.

100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్


ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారని స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె వివరాలు వెల్లడించారు. ఈ ఆస్పత్రిలో పేషెంట్ల సంఖ్య పెరిగిందని, 100 పడకల హాస్పిటల్‌గా మార్చాలని కేసీఆర్‌ను కోరగా వెంటనే ఆయన సీఎంఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు విడుదలవుతాయని తెలిపారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వైద్యులకు కూడా సమాచారం అందించారని చెప్పారు. 100 పడకల ఆస్పత్రిగా మారితే 25 మంది వరకు ఉన్నత వైద్యులు ఇక్కడ సేవలందిస్తారని సమాచారం.

ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ బోర్డ్ సభ్యుడిగా సండ్ర



సత్తుపల్లి/దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫాం(ఆయిల్‌ఫెడ్) అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నియమితులయ్యారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ ఎం.హన్మంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, దమ్మపేట మండలానికి చెందిన ఆయిల్ పామ్ రైతు సంఘం నాయకులు ఇద్దరికి కూడా బోర్డులో స్థానం దక్కింది. సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు, అలపాటి రామచంద్రప్రసాద్ సభ్యులుగా నియమితులయ్యారు.

రేయాన్స్‌పై నజర్!



ములుగు జిల్లా కమలాపురంలో మూతపడిన బిల్ట్ కర్మాగారం (ఇన్‌సెట్) సారపాకలోని ఐటీసీ



భూసమస్యకు ఇదే పరిష్కార మార్గం..
- విస్తరణ బాటలో బీపీఎల్
- పేపర్‌కు డిమాండ్ పెరిగినా.. కొత్త యూనిట్ల స్థాపనకు స్థల సమస్య
- బిల్ట్ టేకోవర్‌పై ఐటీసీ ఫోకస్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్లాంట్ విస్తరణకు భద్రాచలం పేపర్ బోర్డ్ – ఐటీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా ములుగు జిల్లాలోని కమలాపురంలో మూతబడిన బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(బిల్ట్)ను టేకోవర్ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. తద్వారా సారపాకలో ఉన్న స్థలసమస్యను అధిగమించొచ్చనే ఆలోచనకు వచ్చారు.

ఇక్కడ సరిపడా స్థలం లేక..

సారపాకలో ఉన్న ఐటీసీ కర్మాగారంలో మూడు షిఫ్టుల్లో పేపర్ ఉత్పత్తి చేసినా డిమాండ్‌కు తగిన స్థాయిలో సరఫరా చేయలేకపోతోంది. దీంతో సాలీనా 2.50 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఎనిమిదో యూనిట్ స్థాపనకు దశాబ్ద కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. ఏళ్లు గడిచినా భద్రాచలం పరిసర ప్రాంతాల్లో స్థల సేకరణ సాధ్యం కాలేదు. దీంతో ఐటీసీ కర్మాగారం ప్రాంగణంలో 30 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఉద్యోగుల నివాస స్థలాలను కూల్చేయాలని నిర్ణయించింది. ఇలా అందుబాటులోకి వచ్చిన స్థలంలో ఎనిమిదో యూనిట్ నిర్మాణం చేపడుతోంది. ఇందులో 15 ఎకరాల విస్తీర్ణంలో మిషనరీ రానుండగా మిగిలిన 15 ఎకరాలు పని ప్రదేశంగా ఉపయోపడుతుంది. ఈ యూనిట్ నిర్మాణం కోసం సంస్థ రూ. 2,600 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అయితే భవిష్యత్‌లో మరో యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం అసాధ్యమనే పరిస్థితులు నెలకొన్నాయి.

పేపర్‌కు పెరిగిన డిమాండ్

సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యాన ఈ – పేపర్లు రావడం, ఆన్‌లైన్ తరగతుల విధానం అందుబాటులోకి రావడంతో క్రమంగా పేపర్ వినియోగం తగ్గిపోతుందనే భావన పదేళ్ల క్రితం నెలకొంది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇంటర్నెట్ వినియోగం విస్తృతంగా అందుబాటులోకి వచ్చినా చదువుకునే వారి సంఖ్య పెరిగింది. దీంతో విద్యారంగంలో కాగితం వినియోగం స్వల్ప స్థాయిలో అంటే మూడు శాతమే క్షీణించింది. మరోవైపు ఇంటర్నెట్ కారణంగా ఆన్‌లైన్ మార్కెటింగ్ రంగం వాయువేగంతో దూసుకుపోతోంది. దీంతో ప్యాకేజింగ్ ఇండస్ట్రీలో కాగితానికి భారీగా డిమాండ్ పెరిగింది. దీనికి తోడు ప్లాస్టిక్ బదులు కాగితాన్నే వాడాలనే ప్రచారం ప్రపంచవ్యాప్తంగా ఉధృతంగా సాగుతోంది. ఫలితంగా ప్యాకేజీ ఇండస్ట్రీలో డిమాండ్ 23 శాతం పెరిగింది. భద్రాచలం పేపర్ బోర్డులో తయారయ్యే వర్జిన్ బోర్డు(పేపర్) రకం ప్యాకింగ్‌కు ఎంతో అనువుగా ఉంటుంది. దీంతో రాబోయే రోజుల్లో ఈ వర్జిన్ బోర్డుకున్న డిమాండ్ ఆకాశాన్నంటే అవకాశం ఉంది. కానీ ఇందుకు తగ్గట్టుగా ఉత్పత్తి ఎలా పెంచాలనేది ఐటీసీకి సవాల్‌గా మారింది.

కోర్టు మెట్లెక్కిన కార్మికులు, బ్యాంకర్లు

బిల్ట్ పరిశ్రమ మూసేయడంతో అప్పు ఇచ్చిన బ్యాంకర్లు, ఫైనాన్షియర్లతో పాటు అక్కడ పనిచేసిన కార్మికులు, ఉద్యోగులు బకాయిల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఫ్యాక్టరీ ఆస్తులు అమ్మి బకాయిలు చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఏడాది కాలంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. కమలాపురంలో బిల్ట్ సంస్థకు మొత్తం 500 ఎకరాల స్థలం ఉంది. ఇందులో 300 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీ, వుడ్ యార్డులు ఉండగా, 200 ఎకరాల విస్తీర్ణంలో కార్మికులు, ఉద్యోగుల కాలనీ ఉంది. ప్రస్తుతం ఈ స్థలం అంతా బిల్ట్ ఆధీనంలోనే నిరుపయోగంగా ఉంది. ఈ స్థలాలను కొనుగోలు చేసేందుకు ఐటీసీ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు బిల్ట్ స్థానంలో మరో పరిశ్రమ వస్తే సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సైతం సుముఖంగా ఉంది. న్యాయపరమైన అంశాలన్నీ కొలిక్కి వచ్చిన తర్వాత ఐటీసీ చేసిన ప్రతిపాదనల్లో వేగం పెరిగే అవకాశం ఉంది.

కమలాపురం అనుకూలం

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఐటీసీ సంస్థకు భద్రాచలం, రాజమండ్రిలో ప్లాంట్లు ఉన్నాయి. భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి పెంచాలంటే ఈ రెండు చోట్ల ప్లాంట్ల విస్తరణ కష్టంగా మారనుంది. పైగా పేపర్ పరిశ్రమకు అనువైన మౌలిక వసతులు, ముడి పదార్థాలు మంగపేట దగ్గర పుష్కలంగా ఉన్నాయి. దీంతో ఐటీసీ యాజమాన్యానికి కమలాపురంలోని బిల్ట్ మంచి అవకాశంగా మారుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మూతబడిన 'బిల్ట్'

70వ దశకంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అమలు చేసిన ఆరు సూత్రాల పథకంలో భాగంగా భద్రాచలం(సారపాక)తో పాటు అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా, ప్రస్తుత ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో కూడా పేపర్ పరిశ్రమను స్థాపించారు. ఆరంభంలో భద్రాచలం ఫ్యాక్టరీ కంటే కమలాపురంలోనే ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువ. కానీ కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో కమలాపురం ఫ్యాక్టరీ(బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) విఫలమైంది. చివరకు నష్టాల బాట పట్టడంతో 2014లో ఆ ఫ్యాక్టరీ మూతబడింది. ఈ కర్మాగారాన్ని తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు ప్రకటించినా.. యాజమాన్యం ముందుకు రాలేదు. దీంతో గత ఎనిమిదేళ్లుగా ఫ్యాక్టరీలో ఉన్న యంత్రాలు ఎందుకూ పనికి రాకుండా పోగా, విలువైన పరికరాలు దొంగల పాలయ్యాయి.

పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాలి

అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన డీఈఓ శర్మ

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే పాఠశాలలను సుందరంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్ అధికారులకు సూచించారు. ఐడీఓసీలో బుధవారం మన ఊరు – మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులపై విద్యా శాఖ, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఊరు – మనబడిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇప్పటివరకు రూ.43 కోట్ల విలువైన పనులు చేపట్టగా, రూ.41 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నిధుల కొరత లేదని, నిధులు రావడం లేదనే అపోహను కాంట్రాక్టర్లు నమ్మవద్దని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. రంగులు వేసేందుకు సిద్ధంగా ఉన్న 86 పాఠశాలల్లో ఈ నెలాఖరు నాటికి ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు నిలుస్తున్న పాఠశాలల్లో మట్టి నింపేందుకు అవసరమైన నివేదికలు అందజేయాలన్నారు. గ్రీనరీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, హరితహారం కార్యక్రమంలో పాఠశాల ఆవరణల్లో అందమైన గ్రీనరీ తయారు చేయాలని చెప్పారు. ఫుట్‌పాత్‌కు మంచి టైల్స్ వేయాలని సూచించారు. డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో డీఈఓ సోమశేఖర శర్మ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈ నాగేశ్వ, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, ఇరిగేషన్ ఈఈ సురేష్, శ్రీనివాస్, పీఆర్ ఈఈ మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలోని ఈవీఎం, వీవీ ప్యాట్ గోడౌన్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ బుధవారం తనిఖీ చేశారు. గోదాం చుట్టూ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాం వద్ద పటిష్ట నిఘా కొనసాగించాలని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు సాంబశివనాయక్, సత్యనారాయణ, లక్ష్మణ్ అగర్వాల్, కల్యాణ్, రాహుల్, సలీం, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను నిరంతరం పర్యవేక్షించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

భద్రాచలం: గోదావరి వరదల సమయంలో ముంపు గ్రామాల్లో ఉన్న గర్భిణుల జాబితా సిద్ధంగా ఉంచాలని, వారిని నిరంతర పర్యవేక్షించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష సిబ్బందిని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంత పీహెచ్‌సీల వైద్యులతో ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలంలో గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే ఆయా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రసూతికి దగ్గరగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ప్రసవం అయ్యేవరకు పరీక్షలు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. వారి వెంట వచ్చే కుటుంబసభ్యులకు కూడా వసతి కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో విషసర్పాలు, క్రిమికీటకాల కాటుకు సంబంధించిన మందులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సీజన్‌లో గోదావరి వరదలు ఎప్పుడైనా రావచ్చని, వైద్య సిబ్బంది స్థానికంగానే ఉంటూ 24 గంటలూ ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. మారుమూల గ్రామాల గిరిజనులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మెడికల్ ప్రోగ్రాం అధికారి బాలాజీనాయక్, డాక్టర్లు స్పందన, మణికంఠ, పర్షియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన క్యూసీఐ బృందం

అశ్వాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సెంట్రల్ క్వాలిటీ కామర్స్ ఆఫ్ ఇండియా సంస్థ సభ్యులు బుధవారం సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, ఎస్‌హెచ్‌ఓ, సిబ్బంది పనితీరు, పెట్రోలింగ్ వంటి 150 అంశాలపై ఎస్‌హెచ్‌ఓ, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు జితేందర్, సురేష్ పాల్గొన్నారు.

తాలిపేరుకు వరద పోటు


ఏడు గేట్లు ఎత్తి నీటి విడుదల



ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటు తాకింది. పూర్తిస్థాయిలో నీరు చేరడంతో ప్రాజెక్ట్ వద్ద సందడి నెలకొంది. సాగునీటి నిల్వ కోసం గేట్లను దించిన 48 గంటల్లోనే ప్రాజెక్ట్ నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి వరద నీరు చేరుతుండడంతో ఏడు గేట్లను రెండడుగుల మేర ఎత్తి 7,579 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేశారు. సాగునీటి నిల్వ కోసం అధికారులు సోమవారం సాయంత్రం 25 క్రస్ట్ గేట్లను పూర్తిగా కిందకు దించారు. అదే రోజు రాత్రి నుంచి వరదనీటి రాక ప్రారంభం కాగా, మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 71.30 మీటర్లకు చేరుకుంది. బుధవారానికి మరింతగా నీరు రావడంతో ఏడు గేట్లు ఎత్తారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో 5,342 క్యూసెక్కులు వస్తుండగా 7,579 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ డీఈ తిరుపతి, ఏఈ ఉపేందర్ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కేవీకే అధికారుల క్షేత్రస్థాయి పర్యటన



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు బుధవారం ములకలపల్లి మండలం జగన్నాథపురం, సీతాయిగూడెం, కమలాపురం గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి మొక్కలు 20 నుంచి 30 రోజుల దశలో ఉన్నాయని, రసం పీల్చు, లద్దె పురుగులు ఆశిస్తున్నట్లు గమనించామని తెలిపారు. వీటి నివారణకు అవసరమైన మందుల గురించి రైతులకు వివరించారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో కనీస వర్షపాతం కూడా నమోదు కాలేదని, ముఖ్యంగా శాతవాగు, మొగరాలగుప్ప, జిన్నలగూడెం, మోతుగూడ వంటి ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా నమోదైందని చెప్పారు. ఇంకా 20 రోజుల వరకు పత్తి గింజలు వేసుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ జి.లాల్ చంద్, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ, ఏఓలు, రైతులు తన్నీరు చిన్న పుల్లయ్య, వాడే చిన్న నర్సయ్య, అడపా నాగేశ్వరరావు, అనుమాల రాధాకృష్ణ, అనుమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలేరుకు సాగర్ నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న అధికారులు

కూసుమంచి/నాగార్జునసాగర్: కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా పడిపోవటంతో తాగునీటికి ఇక్కట్లు ఎదురవుతుండగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా బుధవారం నీటిని విడుదల చేశారు. నల్లగొండ జిల్లాలోని దేవులపల్లి రిజర్వాయర్‌కు నీటిని బుధవారం విడుదల చేయగా అక్కడి నుండి పాలేరు రిజర్వాయర్‌కు వదిలారు. ఈమేరకు దేవులపల్లి రిజర్వాయర్ వద్ద నీటి పారుదల శాఖ మిర్యాలగూడ డీఈఈ సంపత్ పూజలు నిర్వహించి గేట్లు ఎత్తారు. తొలుత 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, దశల వారీగా 4వేలకు పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, గురువారం రాత్రి వరకు పాలేరుకు సాగర్ జలాలు చేరుకుంటాయని డీఈఈ మధు తెలిపారు. అయితే, ఈ నీటిని తాగునటి అవసరాలకే తప్ప సాగుకు ఉపయోగించకుండా చూడాలన్నారు.

వానొస్తే వణుకే..

- పలు గ్రామాలకు 'లో – లెవల్' కష్టాలు
- ఏటా వరద పోటుకు గురవుతున్న పల్లెలు
- నిలిచిపోతున్న రాకపోకలు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న పనులు



కొత్తగూడెం – పెనుబల్లి మధ్యనున్న లో లెవల్ చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు(ఫైల్)

చుంచుపల్లి: వర్షాకాలం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాల ప్రజలకు వణుకు మొదలవుతుంది. వరద ఉధృతితో జిల్లాలో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. లో లెవల్ వంతెనలు దాటే ప్రయత్నంలో కొందరి ప్రాణాలు కూడా గాలిలో కలుస్తున్నాయి. జిల్లాలో 100 పైగా గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాగులు, చెరువులు పొంగిపొర్లడంతో రహదారులపై ఉన్న వంతెనలు, కల్వర్టులు నీటమునిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. అత్యవసర సమయాల్లో గర్భిణులు, వృద్ధులు, పిల్లలు ఈ వంతెనలు దాటలేక నరకయాతన పడుతున్నారు. అవసరమైన చోట హై లెవెల్ వంతెనలు నిర్మించకపోవడంతో వర్షాకాలం మొత్తం ప్రజలకు అవస్థలు ఎదురవుతూనే ఉన్నాయి.

ఏటా ఇదే సమస్య..

జూలై, ఆగస్టు నెలల్లో కురిసే భారీ వర్షాలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వాగులు, చెరువులు పొంగిపొర్లుతుంటాయి. దీంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు స్తంభించడం పరిపాటిగా మారుతోంది. ముఖ్యంగా గతేడాది వచ్చిన వర్షాలు, వరదలు జిల్లాను అతలాకుతలం చేశాయి. భారీ వర్షాలతో లోతట్టు గ్రామాల పరిధిలోని వంతెనలు వరద పోటుకు గురవుతుంటాయి. ముఖ్యంగా పాల్వంచ, ములకలపల్లి, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, అశ్వాపురం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పినపాక, కరకగూడెం, దుమ్ముగూడెం, అశ్వారావుపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఈ సీజన్‌లో అవస్థలు పడాల్సి వస్తోంది. గతేడాది వరదలకు జిల్లాలో 31 చోట్ల పీఆర్ రహదారులు సైతం దెబ్బతిన్నాయి. లో లెవల్ వంతెనలు, రోడ్ల మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు పంపగా 20 పనులకు రూ.17.34 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 12 చోట్ల ఇంకా పనులు చేపట్టనే లేదు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్లే ఈ సమస్య నెలకొందని అధికారులు చెబుతున్నారు.

ఈ గ్రామాల్లోనే తీవ్ర సమస్య..

- ములకలపల్లి మండలం చాప్రాలపల్లి–కుమ్మరిపాడు, జగన్నాథపురం–రాచన్నగూడెం, పూసుగూడెం – సంజీవపల్లి, పొగళ్లపల్లి – రాజుపేట కాలనీల మధ్య ఉన్న లో లెవల్ చప్టాలు వరద పోటుకు గురై ప్రజలు ఇబ్బంది పడుతుంటారు.
- ఇల్లెందు మండలం రాఘబోయినగూడెం చెరువు పూర్తిగానిండితే రహదారిపైకి వరదనీరు చేరి ముల్కపల్లి, బోటితండా, బోటిగుంపు, గోపాలపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి.
- టేకులపల్లి మండలం రోళ్లపాడు, తెల్లవాగు, ముర్రేడు వాగుల్లో వరద వస్తే రాజుతండా, జెండాలతండా, పెట్రాంచెలక గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తాయి.
- పాల్వంచ మండలంలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్ల ఎత్తితే దిగువన ఉన్న 24 గ్రామాల వారికి రాకపోకలకు ఇబ్బందులే.
- గుండాల మండలంలో కిన్నెరసాని వాగుపై ఉన్న లో లెవల్ వంతెనలతో గుండాల – కొడవటంచతో పాటు నాగారం, పాలగూడెం, దొంగతోగు, పెద్దతోగు, మటన్‌లంక గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు.
- అశ్వాపురం మండలంలోని ఇసుక వాగు పొంగితే అశ్వాపురం – గొందిగూడెం ప్రధాన రహదారిపై ఉన్న లో లెవల్ చప్టా మీదుగా వరద నీరు ప్రవహిస్తుంది. దీనిపై కొత్త బ్రిడ్జి పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఈ వర్షాకాలంలోనూ గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామాల వారికి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇంకా అనేక గ్రామాల వారికి వర్షాకాంలో ఇబ్బందులు తప్పేలా లేవు. అధికారులు స్పందించి వంతెన కష్టాలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

నేలకొండపల్లి: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్.వీ.వేణుగోపాలచారి వెల్లడించారు. నేలకొండపల్లి రైతు వేదికలో బుధవారం ఏర్పాటుచేసిన సదస్సులో కూసుమంచి, పాలేరు, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, బచ్చోడు సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు, ప్రజలు పాల్గొని లోఓల్టేజీ, కనెక్షన్ల పునరుద్ధరణ, నూతన సర్వీసులు, పేరు మార్పిడి తదితర సమస్యలపై వినతి పత్రాలు అందించారు. అనంతరం చైర్మన్ వేణుగోపాలచారి మాట్లాడుతూ వినియోగదారులకు దూరాభారం కాకుండా ఎక్కడికక్కడ సదస్సులు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు కె.తిరుమలరావు, ఆర్.చరణ్‌దాస్, ఎస్.నరేందర్, ఎస్ఈ సురేందర్, డీఈ సీ.హెచ్.నాగేశ్వరరావు, ఏడీఈ బీ.కోక్యానాయక్, ఏఈలు రామారావు, జిల్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'నాబార్డు' ఉత్సవాల్లో డీసీసీబీ అధ్యక్షుడు



సదస్సులో నాగభూషణం, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: న్యూఢిల్లీలో బుధవారం జరిగిన నాబార్డ్ 42వ ఫౌండేషన్ డే ఉత్సవాల్లో ఖమ్మం డీసీసీబీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం పాల్గొన్నారు. అలాగే, డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరబాబు హాజరయ్యారు. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా మాట్లాడగా తెలంగాణ నుంచి డీసీసీబీల అధ్యక్షులు, సీఈఓలు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

పాల్వంచ: బాలకార్మికులతో పనిచేయించుకుంటున్న ముగ్గురిపై బుధవారం కేసులు నమోదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్ టీం ఆధ్వర్యంలో పట్టణంలో బూర్గంపాడు ఎస్‌ఐ శ్రీనివాస్, లేబర్ ఆఫీసర్ నాగరాజు, డీసీపీయూ కౌన్సిలర్ కల్యాణి, చైల్డ్‌లైన్ సభ్యులు బషీర్, సిబ్బంది కలిసి పట్టణంలో షాపులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రెండు చికెన్ షాపులు, ఒక ఆటో గ్యారేజీలో ముగ్గురు బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. బాల కార్మికులతో పనిచేయించుకుంటున్న యజమానులు చిన్నంశెట్టి రాజేశ్వరి, పొన్నం ఉదయ్‌కుమార్, చందా మనోహర్‌లపై కేసులు నమోదు చేశారు. ముగ్గురు పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సెలింగ్ చేశారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

ఇల్లెందురూరల్: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న వివాహిత బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రొంపేడుకు చెందిన భద్రకాళి (22) భర్త వేధింపులు తాళలేక గత నెల 28న గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా భద్రకాళికి మూడేళ్ల క్రితం రాంబాబుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5.50 లక్షలు కట్నంగా ఇచ్చారు. అదనపు కట్నం కోసం భర్త నిత్యం వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె సోదరుడు వాపోయాడు. మృతురాలి సోదరుడు బోడ శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రామాలయ ప్రధాన అర్చకుడికి గాయాలు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు విజయరాఘవన్‌కు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. అర్చకుడు ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా కుక్క అడ్డు రావటంతో డివైడర్‌ను ఢీ కొట్టారు. స్వల్ప గాయాలైన ఆయనను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా ప్రమాదమేమి లేదని వైద్యులు తెలిపారు.

ఇద్దరు బాల కార్మికుల గుర్తింపు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న ఓ దుకాణం, ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న చెప్పుల దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరు బాల కార్మికులను పోలీసులు గుర్తించారు. సదరు దుకాణాల యజమానులపై కేసు నమోదు చేశారు.

పశువుల వాహనం పట్టివేత

భద్రాచలంఅర్బన్: సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు కంటైనర్ వాహనంలో ఏడు పశువులను చర్ల నుంచి పండితాపురం సంతకు అక్రమంగా తరలిస్తుండగా బుధవారం బ్రిడ్జి సెంటర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని ఠాణాకు తరలించి, పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

సారా విక్రేతపై కేసు నమోదు

కరకగూడెం: మండలంలోని అనంతరం గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న గుంజ బాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కరకగూడెం ఎస్సై రాజారామ్ బుధవారం తెలిపారు. అతని ఇంట్లో 10 లీటర్ల గుడుంబా లభించగా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాంతం



మరుగున పడుతున్న 'మారెళ్లపాడు'!

- గత జనవరిలో ఎత్తిపోతల పథకానికి విప్ రేగా శంకుస్థాపన
- ఆరు నెలలు గడిచినా ప్రారంభంకాని నిర్మాణ పనులు

అశ్వాపురం: మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ ద్వారా 17 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చేపడుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఇక్కడి నుంచి పాలేరు వరకు నీరు తరలిస్తూ ఈ ప్రాంత రైతాంగానికి నీరు అందించడం లేదని రైతులు ఆందోళన చెందారు. దీంతో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం మంజూరు చేశారు. గత జనవరి 29న మండల పరిధిలోని బీజీ కొత్తూరు పంప్‌హౌస్ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు అనుబంధంగా రూ.25 కోట్లతో నిర్మించనున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. శంకుస్థాపన చేసి ఆరు నెలలైనా పనులు ప్రారంభకాలేదు. గత జనవరి 31న మేఘా ఇంజనీరింగ్ సంస్థ ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ఈఎన్‌సీ పొలసాని వెంకటరామారావు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ఖరీఫ్‌కే ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ ఇప్పటివరకు అతీగతీలేదు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ మూడు నెలలు నిర్మాణ పనులు సాధ్యం కావు. వచ్చే ఖరీఫ్ వరకైనా ఈ ఎత్తిపోతల పథకం పనులు పూర్తవుతాయో లేదోనని అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ పథకం ద్వారా అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు, చింతలచెరువు, ఎర్రబొక్కలచెరువు, తీగలచెరువులను గోదావరి జలాలతో నింపి మండలంలోని 17 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. ఎత్తిపోతల పథకం పనులు తక్షణమే ప్రారంభించాలని కోరుతున్నారు.

> **త్వరలోనే పనులు..**
>
> 
>
> గోదావరి వరదలకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌లోకి భారీగా వరద వచ్చే అవకాశం ఉండటంతో ఆనకట్ట సమీపంలో హెడ్ రెగ్యులేటర్ వద్ద 2.6 కిలోమీటర్ వద్ద పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం. అందువల్ల మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు చేపట్టలేదు. త్వరలోనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తాం.
>
> –శ్రీనివాసరెడ్డి, సీఈ జలవనరులశాఖ

టౌన్‌ప్లానింగ్‌లో ముడుపుల మాయ!

- బహుళ అంతస్తుల భవనాలకు అనధికార అనుమతులు
- రెగ్యులర్ టీపీఓ లేకపోవడంతో అంతా తానై వ్యవహరిస్తున్న ఓ అధికారి
- ఐదేళ్లకు పైగా ఒకే చోట విధులు
- పైఅధికారుల అండతో ఇష్టారాజ్యం..



పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం



గణేష్‌టెంపుల్ రోడ్డులో ఒక వైపు మాత్రమే నిర్మిస్తున్న డ్రెయినేజీ

కొత్తగూడెంఅర్బన్: భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. నిర్మాణాల్లో నిబంధనలు పాటించకపోయినా ముడుపులు ముట్టజెప్పితే పనులవుతాయనే నానుడి నెలకొంది. పట్టణాల్లో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని టౌన్ ప్లానింగ్‌కు అనుగుణంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం మున్సిపాలిటీ కార్యాలయాల నుంచి అనుమతి పొందాలి. కానీ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీబీఎస్ అధికారిని కలిస్తే అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టొచ్చనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కొందరు బడా బాబులు అనుమతులు ఒకలా తీసుకుని, నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. వాటిని నిరోధించాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోగా.. సంబంధిత భవన యజమానులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

నాలుగేళ్లుగా రెగ్యులర్ టీపీఓ లేరు..

జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెనికి నాలుగేళ్లుగా రెగ్యులర్ టీపీఓ లేరు. అప్పటి నుంచి టీపీఓలు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న టీపీఓ వారంలో మిర్యాలగూడ మున్సిపాలిటీలో మూడు రోజులు, కొత్తగూడెంలో మూడు రోజులు విధులు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ టీపీఓ స్థానికంగా ఉండకపోవడంతో టీపీబీఎస్ అంతా తానై వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పంచాయతీరాజ్ నుంచి డిప్యూటేషన్‌పై కొత్తగూడెం మున్సిపాలిటీకి ఏఈగా వచ్చిన అధికారిని టీపీబీఎస్‌గా కొనసాగిస్తున్నారు. ఆయన కొత్తగూడెం మున్సిపాలిటీకి వచ్చి ఐదేళ్లు గడిచినా బదిలీ చేయడంలేదు. మున్సిపల్ అధికారులు కూడా అందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదని తెలుస్తోంది. పట్టణంలో టీపీబీఎస్ ప్రమేయంతో ఎన్నో నిర్మాణాలు జరుగుతున్నా, మున్సిపల్ ఆదాయానికి గండి పడుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలేదు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రఘును వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. వారు స్పందించలేదు.

ఆరోపణల్లో కొన్ని ఇలా...

- టీపీబీఎస్ కనుసన్నల్లో అనధికారికంగా బహుళ అంతస్తులు నిర్మితమవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లే మార్గంలో గొల్లగూడెం ఏరియాలో ఓ బార్‌షాపు పక్కన బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టారు. సదరు యజమాని మున్సిపాలిటీలో అనుమతి ఒకలా తీసుకుని, నిర్మాణం మరోలా చేపట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. భవనానిక సెడ్‌బ్యాకు, పార్కింగ్ సౌకర్యం, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవు.
- ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఓ లాడ్జి వెనుక భాగంగా మరో బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టారు. ఫైర్ అనుమతులు, సెడ్ బ్యాక్ లేకుండానే భవనం నిర్మిస్తున్నారు.
- గణేష్‌టెంపుల్ రోడ్డులో మరో భవనానికి అనుమతులు లేవంటూ మున్సిపల్ అధికారులు బిల్డింగ్‌కు హెచ్చరిక బోర్డులు పెట్టారు. కానీ సదరు భవనం యజమాని టీపీబీఎస్ అధికారి ప్రమేయంతో నిర్మాణం యథేచ్ఛగా సాగిస్తున్నాడు.
- ప్యూన్‌బస్తీ టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా నిర్మాణం అవుతున్న భవనానికి సైతం మున్సిపాలిటీ నుంచి అనుమతులు లేవు. మున్సిపల్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చి, నిర్మాణ పనులను అడ్డుకున్నారు. కాగా ప్రస్తుతం టీపీబీఎస్, ఇతర మున్సిపల్ అధికారుల సహకారంతో నిర్మాణ పనులు సాఫీగా సాగుతున్నాయి.
- గణేష్‌టెంపుల్ రోడ్డు నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు వెడల్పు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ రోడ్డుకు ఒక వైపు నిర్మాణం చేపట్టడం, మరో వైపు వదిలివేయడం వంటివి చేస్తూ వివక్ష చూపడంతో స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పోడు పట్టాల పంపిణీ అడ్డగింత

- పట్టాలను తిరస్కరించిన పోడు సాగుదారులు
- వెనుదిరిగిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



బచ్చువారిగూడెంలో పోడు సాగుదారులకు సర్దిచెబుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



పోడు పట్టాలను తిరస్కరించి వెళ్లిపోతున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: పోడు పట్టాల పంపిణీలో అశ్వారావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు మరోసారి నిరసన సెగ తగిలింది. పట్టాలు మంజూరుకాని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేసి, పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని ఖమ్మంపాడులో 92 మందికి, గుంటిమడుగులో 108 మందికి, రమణక్కపేట, మేకలబండ గ్రామాల్లో 96 మందికి పోడు పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే బచ్చువారిగూడెం, కోయ రంగాపురం గ్రామాల్లో కూడా పోడు పట్టాల పంపిణీకి ఎమ్మెల్యే హాజరయ్యారు. కాగా, ఆయా గ్రామాల పోడు సాగుదారులు తమకు పట్టాలు మంజూరు కాలేదంటూ వాగ్వాదానికి దిగారు. పంపిణీని అడ్డుకున్నారు. బచ్చువారిగూడెం, కొత్త వాగొడ్డుగూడేనికి చెందిన 48 మంది గిరిజనులు పోడు సాగు చేస్తుండగా వీరిలో 24 మందికి మాత్రమే పోడు హక్కు పత్రాలు మంజూరయ్యాయి. మిగిలిన పోడు సాగుదారులకు హక్కు పత్రాలు రాలేదు. అందరికీ పోడు పట్టాలు ఇస్తేనే పంపిణీ చేయాలని, లేనిపక్షంలో పట్టాలను వెనక్కి తీసుకెళ్లాలని తిరస్కరించారు. పట్టాలు రానివారికి రీ సర్వే చేసి, మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే సర్ది చెప్పేందుకు యత్నించారు. అయినా సరే పోడు సాగుదారులు ఒప్పుకోలేదు. ఎమ్మెల్యే మాట్లాడుతున్న క్రమంలోనే అధిక సంఖ్యలో గిరిజనులు సభ నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే కూడా చేసేదేమిలేక పోడు పట్టాలు పంపిణీ చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి కేఎల్‌ఆర్ కృషి మరువలేనిది



కేఎల్‌ఆర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి తదితరులు

పాల్వంచ: విద్యావ్యాప్తికి కేఎల్‌ఆర్ చేసిన కృషి మరువలేనిదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కేఎల్‌ఆర్ 12వ వర్ధంతి సందర్భంగా కేఎల్‌ఆర్ ఘాట్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఎం.రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పొంగులేటి మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేఎల్‌ఆర్ మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ, కాసాని ఐలయ్య, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, సోమరాజుదొర, కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్ పర్సన్ నాగమణి, గోవింద్‌రెడ్డి, శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

టేకులపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూలు వేర్వేరుగా పంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా కోరం మాట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతున్న పంచాయతీ కార్మికుల శ్రమ, కృషి వల్లే ఉత్తమ అవార్డులు పొందారని, గుర్తింపు వచ్చిందని, అలాంటి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులకు తీరిక లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో గ్రామపంచాయతీ సిబ్బందిని క్షణం తీరికలేకుండా ఉపయోగించుకున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు.. ఇప్పుడు వారి సమస్యలపై నోరు మెదపకపోవడం విచారకరమని అన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో కాంగ్రెస్, సీపీఐ, ప్రజాపంథా, ఇఫ్టూ నాయకులు గుమ్మడి నర్సయ్య, గుగులోత్ రాంచందర్, బి.రాంసింగ్, యాకూబ్ షావలి, లక్కినేని సురేందర్ రావు, భూక్య దళసింగ్, భూక్యా దేవా నాయక్, ఆకారపు స్వప్న, ఎజ్జు భాస్కర్, నోముల భానుచందర్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, సుందర్, బాబు, రెడ్యా నాయక్, అజ్మీరా శివ, పూనెం సురేందర్, ఈది గణేష్, పున్యా నాయక్, మూడ్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కుచ్చుటోపీ

నకిలీ విత్తనాలు అంటగట్టి మోసం చేసిన దళారులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు కొందరు దళారులు ఆడా మగా సీడ్ పేరుతో నకిలీ విత్తనాలు అంటకట్టి కుచ్చుటోపీ పెట్టారు. అనంతారంలో పలు గ్రామాలోని బాధిత రైతులు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓ కంపెనీకి చెందిన విత్తనాలను సాగు చేస్తే ఒక ఎకరానికి 15 నుంచి 20 క్వింటాల ధాన్యం దిగుబడి వస్తుందని నమ్మబలికారని, తీరా వాటిని సాగు చేస్తే ఎకరానికి 5 క్వింటాల దిగుబడి కూడా రాలేదని పేర్కొన్నారు. నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పి రైతులు ధాన్యాన్ని తీసుకెళ్లి నేటి వరకు పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు ఆరంభంలో రైతుల నుంచి బలవంతంగా బాండ్ పేపర్ల మీద సంతకాలు తీసికున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రైతులను మోసం చేసిన దళారులపై చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు కొమ్మ సత్యనారాయణ పాయం రాజబాబు, అత్తె సత్యనారాయణ, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణానికి చెందిన ఓ మహిళపై బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. జ్యోతి అనే మహిళ తన బంధువుల ఇంటికి భోజనం చేసేందుకు రాగా అదే సమయంలో అక్కడికి వచ్చిన లక్ష్మి అనే మహిళ అకారణంగా కులం పేరుతో దూషించింది. బూతులు తిట్టి, కొట్టింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఆభరణాలు చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో చోరీ ఘటనపై బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన బ్రహ్మానందచారి కుటుంబంతో కలిసి ఈ నెల 6న షిరిడీ యాత్రకు వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో పరిశీలించగా రూ.90 వేలు విలువైన ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు.

గంజాయి రవాణా కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన చామకూరి ధనలక్ష్మి, చామకూరి రాంబాయికి ఇరవై ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రత్యేక సెషన్స్ న్యాయమూర్తి ఉమాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2019 జూలై 9న ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో సోదా చేశారు. ధనలక్ష్మి, రాంబాయి వద్ద 14.500 కేజీల గంజాయి ఉండడంతో అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి వీరిద్దరికి జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఏడాది జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున కొత్తా వెంకటేశ్వరరావు, హరీందర్‌రావు వాదించగా.. సిబ్బంది వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ, అయూబ్ సహకరించారు.

ఉద్యోగాల పేరుతో మోసం?

పాల్వంచ: ఉద్యోగాల కోసం డబ్బులు ఇచ్చి మోసపోయిన యువకులు మూడు రోజులుగా పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఫేక్ కంపెనీల్లో ఉద్యోగాల పేరుతో కొందరు యువకులను ఓ మహిళ బురిడీ కొట్టించిన విషయం విదితమే. పాల్వంచకు చెందిన సదరు మహిళ హైదరాబాద్‌లో ఉంటూ ఇక్కడి కొందరు యువకులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి రూ.లక్షలు వసూళ్లు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సదరు మహిళ ఇచ్చిన జాయినింగ్ ఆర్డర్లలో ఉన్న చిరునామాకు వెళ్లి చూడగా అక్కడ ఆ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీలే లేవని, గతంలో ఉండేవని, కరోనా తర్వాత సదరు కంపెనీలు మూసేశారని వాపోతున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని సంవత్సరాల నుంచి తిరుగుతున్నా.. ఆయా కంపెనీల ఉన్నత స్థాయి వ్యక్తులకు మీరు ఇచ్చిన డబ్బులు ముట్టజెప్పామని, తమకు కమీషన్ మాత్రమే మిగిలిందని చెబుతూ తిప్పుకుంటున్నారని యువకులు పేర్కొంటున్నారు. ఉద్యోగం కోసం ఫోన్‌పే, ఖాతాలకు బదిలీ చేశామని, ఆ నగదు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు.


యువకుడి అదృశ్యం



బొల్లి ఏసు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శిల్పినగర్ కాలనీకి చెందిన బొల్లి ఏసు అనే 20 ఏళ్ల యువకుడు ఈ నెల 9న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని తల్లి లలిత మిత్రులు, బంధువుల ఇళ్లలో వెతికినా సమాచారం లేదు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేశారు.

సీతారాంనగర్ కాలనీలో..



వెంకన్న (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన వెంకన్న అనే వ్యక్తి ఈ నెల 8న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. వెంకన్న కుమారుడు కుమ్మం బాలరాజు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

'తాలిపేరు' రక్షణ గోడను ఢీకొన్న లారీ



వంతెనపై రక్షణ గోడను ఢీకొట్టి ఆగిన లారీ

చర్ల: తాలిపేరు హైలెవల్ వంతెనపై లారీ అదుపు తప్పి పక్కన ఉన్న రక్షణ గోడకు ఢీకొట్టిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం మండలంలోని గొల్లగూడెం నుంచి ఖమ్మం వైపునకు ఇసుక లోడ్‌తో లారీ వెళ్తోంది. తాలిపేరు బ్రిడ్జి దాటిన తర్వాత ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొట్టింది. లారీ బ్రిడ్జిపైనే నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే సుమారు 40 అడుగుల లోతు ఉన్న లోయలో పడిపోయేది.

తెయూలో మరోసారి విజిలెన్స్ విచారణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఉదయం 11.30 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్న అధికారులు సాయంత్రం 5.30 గంటల వరకు ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో 8 మందిని తెయూ పరిపాలనా భవనంలోని ఎగ్జిక్యూటివ్ హాల్‌లో సుదీర్ఘంగా విచారించారు. వీసీ ప్రొఫెసర్ డి.రవీం దర్‌గుప్తా అక్రమాలకు సహకరించారని ఆరోపణలున్న మాజీ ఇంచార్జి రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధినితో పాటు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.అరుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు సాయాగౌడ్, విజయలక్ష్మి, సూపరింటెండెంట్ భాస్కర్ (అకౌంట్ సెక్షన్), అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరణ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ శాంతాబాయిలను విజిలెన్స్ అధికారులు విచారించారు. వీసీ చేసిన అక్రమ పదోన్నతులు, నియామకాలు, విచ్చలవిడి కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జూన్ 6న మొదటిసారి దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఎంసీసీ కంపెనీ ఆస్తుల అటాచ్‌మెంట్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల సిమెంటు కంపెనీ(ఎంసీసీ) ఆస్తులను టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారులు బుధవారం అటాచ్‌మెంట్ చేసుకున్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషారావు, డీఈఈ కైసర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిమెంట్ కంపెనీ రూ.10.30 కోట్లు విద్యుత్ బిల్లులు బకాయి పడింది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం స్పందించలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తెలంగాణ రెవెన్యూ రికవరీ యాక్టు 1864 ప్రకారం కంపెనీలోని యంత్రపరికరాలు, భవనాలతోపాటు 184 ఎకరాల 28 గుంటల భూమిని స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ తహసీల్దార్ ప్రసాదరావులు ఎంసీసీ అధికారుల సమక్షంలో అటాచ్‌మెంట్ చేశారు. కాగా, ఎంసీసీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కంపెనీకి చెందిన విలువైన ఆస్తులను యాజమాన్యం ఇప్పటికే అమ్ముకుందని, కంపెనీ మూసివేసి కార్మికులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంసీసీ ఆస్తులను స్వాధీనం చేసుకుని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటిదొంగ 'ఈశ్వరన్' ఔట్

అవినీతి ఊబిలో చంద్రబాబు సింగపూర్ స్నేహితుడు

- 'సీపీఐబీ' విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రధాని
- రవాణా శాఖ మంత్రిగా తొలగింపు
- ఈశ్వరన్‌ను ముందుపెట్టి బాబు అంతర్జాతీయ డ్రామా
- ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా ప్రచారం
- అమరావతి స్టార్టప్ ఏరియాలో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్


తన స్నేహితుడైన సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను సత్కరిస్తున్న చంద్రబాబు(ఫైల్)

సాక్షి, అమరావతి: పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన సింగపూర్ సీనియర్ మంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్నేహితుడు ఎస్.ఈశ్వరన్‌పై అక్కడి అత్యున్నత దర్యాప్తు సంస్థ సీపీఐబీ (కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) విచారణ ప్రారంభించింది. సింగపూర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న ఎస్.ఈశ్వరన్ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశానికి భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు సీపీఐబీ గుర్తించింది. అత్యంత తీవ్రమైన అవినీతికి పాల్పడిన మంత్రి ఈశ్వరన్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సింగపూర్ ప్రధాని లీని సీపీఐబీ డైరెక్టర్ డెనిస్ టాంగ్ ఈనెల 5వతేదీన కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన సింగపూర్ ప్రధాని ఈనెల 6న అనుమతి ఇచ్చారు. ఈనెల 11న సీపీఐబీ విచారణ ప్రారంభించడంతో ఈశ్వరన్‌ను తాజాగా మంత్రి పదవి నుంచి సింగపూర్ ప్రధాని తప్పించారు.

అమరావతి పేరుతో అంతర్జాతీయ నాటకం..
రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాటి సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని సింగపూర్ ప్రభుత్వ సహకారంతో దేవతల రాజధాని అమరావతిని తలదన్నే రీతిలో నూతన నగరాన్ని నిర్మిస్తానంటూ నమ్మబలికారు. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై వందిమాగధులకు లీకులిచ్చి భారీ ఎత్తున భూములను కాజేశారు. ఆ తర్వాత తాపీగా రాజధాని ప్రాంతాన్ని ప్రకటించారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను ముందు పెట్టి గ్రాఫిక్స్ చూపిస్తూ అందరినీ మభ్యపుచ్చారు. ఈ క్రమంలో రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ముసుగులో సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిపి రూ.లక్ష కోట్లు స్వాహా చేసేందుకు స్కెచ్ వేశారు.

సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం అన్నట్లుగా
రాజధానిలో 1,691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టుకు సంబంధించి స్విస్ చాలెంజ్ విధానాన్ని తుస్సుమనిపించి ఇతర కంపెనీలేవీ బిడ్లు దాఖలు చేయకుండా సింగపూర్ సంస్థలు అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంకి కట్టబెడుతూ 2017 మే 2న నాటి చంద్రబాబు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఆ సంస్థల కన్సార్టియంకు స్టార్టప్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అప్పగిస్తూ 2017 మే 12న ఈశ్వరన్‌తో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం కోసం ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లు చంద్రబాబు ప్రచారం చేసుకున్నారు. ఆ ప్రాజెక్టులో పెట్టుబడి సహా మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,721.9 కోట్లు వెచ్చించే రాష్ట్ర ప్రభుత్వం వాటా 42 శాతం కాగా కేవలం రూ.306.4 కోట్లు పెట్టుబడి పెట్టే సింగపూర్ కంపెనీల కన్సార్టియం వాటా 58 శాతం కావడం గమనార్హం. కన్సార్టియం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) కలిసి 15 ఏళ్లలో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా గ్రాస్ టర్నోవర్‌లో మొదటి విడత 5 శాతం, రెండో విడత 7.5 శాతం, మూడో విడత 12 శాతం (సరాసరి 8.7%) ఆదాయం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే సరిపోతుందని నాటి చంద్రబాబు కేబినెట్ అంగీకరించింది. ఈ ముసుగులో రూ.లక్ష కోట్లకుపైగా దోచుకోవడానికి స్కెచ్ వేశారు.

అక్రమాల ఒప్పందం రద్దు..

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని సింగపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఈ ఒప్పందం రద్దు అయింది.

54 వేల ఎకరాల భూ పంపిణీ

- రైతులుగా మారనున్న 46,935 మంది భూమి లేని నిరుపేదలు
- అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన
- సీఆర్డీయే పరిధిలో 24న ఇళ్ల నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్
- దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నో రిటైర్మెంట్
- దేవాదాయ శాఖ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- ఏపీ సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఈనామ్, లంక భూముల రైతులకు భారీ మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. తద్వారా భూములకు సంబంధించి గతంలో ఏ ప్రభుత్వం చేయనంత మేలు రైతులకు చేకూరనుంది. ఈ నిర్ణయాలకు సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం తాత్కాలిక సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దివంగత సీఎం వైఎస్సార్ తర్వాత మళ్లీ భూ పంపిణీకి సీఎం జగన్ సర్కార్ సిద్ధమైంది. 54,129.45 ఎకరాలను భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఆమోదం తెలిపింది. భూమిని ప్రభుత్వం కేటాయించి (అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయిన అనంతరం ఆ భూమిపై సంబంధిత రైతులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీంతో పట్టా భూముల రైతుల మాదిరిగానే అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం వాస్తవంగా ఎవరికైతే భూమిని కేటాయించిందో వారికి యాజమాన్య హక్కు దక్కుతుంది. వారు లేని పక్షంలో వారి వారసులకు హక్కులు రానున్నాయి. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలో దాదాపు 22 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల వారికి ప్రయోజనం చేకూరనుంది. ఇంకా మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాల గురించి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆ కుల వృత్తుల వారికి శుభవార్త
మూడు కేటగిరీల్లోని 9,062 ఎకరాల లంక భూముల రైతులకు డీ పట్టాలు ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కొన్ని భూములను ఐదేళ్ల లీజు ఇవ్వడానికి అనుమతించారు. ఈ నిర్ణయంతో 19,176 మంది రైతులకు మేలు చేకూరనుంది. పేదలకు భూ పంపిణీ, లంక భూములకు డీ పట్టాలు ఇవ్వడం ద్వారా మొత్తంగా 63,191 ఎకరాలకు సంబంధించి 66,111 మందికి లబ్ధి చేకూరనుంది. గ్రామాల్లో కుల వృత్తులు చేసుకునే వారికి ఇచ్చిన సర్వీస్ ఈనామ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కుమ్మరి, రజక, కమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర కుల వృత్తులు చేసుకునే వారికి గతంలో ఈనామ్‌గా ఇచ్చిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. వీటిని ఇప్పుడు ఆ జాబితా నుంచి తొలగింపు ద్వారా వారికి సర్వ హక్కులు కల్పించనున్నారు. 1,68,603.71 ఎకరాల భూములు నిషేధిత జాబితా(22ఏ) నుంచి తొలగించడం ద్వారా 1,13,610 మందికి ప్రయోజనం కలుగనుంది. 2013కు ముందే వీరందరూ రైత్వారీ పట్టాలు పొందారు. ఆ తర్వాత ఈ భూములపై ఆంక్షలను విధించారు. ఇప్పుడీ ఆంక్షలన్నీ తొలగిపోనున్నాయి. దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంత వరకు భగవంతుడి సేవలో కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేసేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే దేవదాయ శాఖ ఉద్యోగులకు కూడా ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు నిర్ణయించింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. పులివెందుల, పాడేరు, ఆదోని మెడికల్ కాలేజీలకు గత మంత్రివర్గ సమావేశంలో పోస్టులు మంజూరు చేశారు. మిగిలిన రెండు చోట్ల.. మదనపల్లి, మార్కాపురం వైద్య కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 1,412 పోస్టుల సృష్టికి కేబినెట్ ఆమోదం తెలిపింది

నల్ల'మార్గ'ం ఉక్కిరిబిక్కిరి..!

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ బ్యాంకులు, కేంద్ర ఆర్థిక సంస్థల్లో కాకుండా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో దాచడం సాధారణ అంశం కాదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై 5 శాతం కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నాయి. మార్గదర్శి కేవలం 5 శాతం వడ్డీనే చెల్లించడం, అదికూడా ఓ రశీదు జారీ చేసి సరిపుచ్చుతున్నా భారీగా డిపాజిట్లు చేయడం వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందో చెప్పాలి. పాన్, ఆధార్ నంబర్ ఇతర వివరాలను సమర్పించాలి. ఆర్బీఐ, ఆదాయపన్ను, సీబీడీటీ అధికారుల దృష్టిలో పడుతుంది. ఆ వివరాలేవీ వెల్లడించేందుకు సుముఖంగా లేనివారు మాత్రమే ఇతర సంస్థల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే వారు డిపాజిట్ చేసేదంతా నల్లధనమే కాబట్టి.

ఇదే తరహా మోసంలో సహారా చైర్మన్‌కు జైలు శిక్ష
బడాబాబుల నల్లధనాన్ని గుట్టుచప్పుడు కాకుండా దాచేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఓ వేదికగా మారిందన్న వాదనకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. అక్రమ డిపాజిట్ల ద్వారా భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తెస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలోనూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు ఇలాంటి వ్యవహారాలనే సాగించినట్లు ఆర్థిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అక్రమ డిపాజిట్లు సేకరించిన సహారా పరివార్ లాంటి సంస్థలు తమ డిపాజిట్‌దారుల వివరాలను గోప్యంగా ఉంచటాన్ని ప్రస్తావిస్తున్నారు. సహారా ఇండియా అక్రమ డిపాజిట్ల వ్యవహారం గుట్టు రట్టు కావడంతో సంస్థ చైర్మన్ సుబ్రతోరాయ్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించడం గమనార్హం. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమ డిపాజిట్ దారులకు సీఐడీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బుకాయించబోయి దొరికిన రామోజీ
మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.కోటి కంటే ఎక్కువ మొత్తం డిపాజిట్ చేసిన వారికి సీఐడీ నోటీసులు జారీ చేయడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న సంస్థ చైర్మన్ రామోజీరావు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ డిపాజిట్‌దారులకు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ పత్రికా ప్రకటన జారీ చేసింది. తాము చిట్‌ఫండ్స్ చట్టం, ఆదాయపన్ను చట్టాన్ని సక్రమంగా పాటిస్తున్నట్లు అందులో పేర్కొంది. అయితే ఆర్బీఐ, సీబీడీటీ నిబంధనలను పాటిస్తున్నట్లు ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు సేకరించడాన్ని ఆర్బీఐ అనుమతించడంలేదు. డిపాజిట్ల సేకరణపై సీబీడీటీ కింద పన్నులు చెల్లించాలి. అలా చెల్లించినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎక్కడా చెప్పడం లేదు. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకే ఆదాయపన్ను చట్టాన్ని పాటిస్తున్నట్లు మభ్యపుచ్చుతున్నట్లు స్పష్టమవుతోంది.

జిల్లా వార్తలు

కళకళలాడుతున్న గోదావరి


ఆనకట్ట వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం: వేసవి కాలంలో బోసిపోయిన భద్రాచలంలోని గోదావరి నీటిమట్టం మళ్లీ స్వల్పంగా పెరుగుతోంది. భారీ వర్షాలు లేకపోయినా ఎగువన సమ్మక్క బ్యారేజీ వద్ద విడుదల చేయటంతో గోదావరిలోకి నీరు చేరింది. మంగళవారం 2 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం బుధవారం ఐదు అడుగులకు చేరుకుంది. దీంతో కరకట్ట దిగువన ఉన్న స్నానఘట్టాల వద్ద జలకళ సంతరించుకుంది. కాగా, గత ఏడాది ఇదే రోజున మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలో గోదావరి ప్రవహించిన విషయం విదితమే.

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద...
అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద బుధవారం గోదావరి పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్రలో ప్రాణహిత నుంచి వరద ప్రవాహం రావడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీరు వదిలారు. దీంతో నీరు దుమ్ముగూడెం ఆనకట్ట వద్దకు చేరుకోగా గోదావరి ప్రవాహం పెరిగి ఆనకట్ట పైనుంచి ప్రవహిస్తోంది.

సీతమ్మసాగర్‌పై ఎన్‌జీటీ విచారణ వాయిదా

అశ్వాపురం: మండలంలోని సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవని దాఖలైన పిటిషన్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) చెన్నై ధర్మాసనం బుధవారం విచారించింది. గత నెల 28న సీతమ్మసాగర్ బ్యారేజీ పనులను పరిశీలించిన ద్విసభ్య కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ జరపగా, పిటిషనర్లు తమ వాదన వినిపించారు. వచ్చేనెల 17వ తేదీకి విచారణను వాయిదా వేసిన ధర్మాసనం.. అప్పటి వరకు ఎలాంటి పనులు చేయొద్దని సూచించినట్టు సమాచారం. ఈ సందర్భంగా పిటిషనర్ తెల్లం నరేష్ మాట్లాడుతూ ద్విసభ్య కమిటీ ఇచ్చిన నివేదికపై ఎన్‌జీటీ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మరోమారు పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని సూచించిందని తెలిపారు.

పెదవాగు.. పనుల్లో జాగు


- గడువు దాటినా పూర్తి కాని ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు
- రూ.కోట్ల విలువైన పనులపై అధికారుల నిర్లక్ష్యం
- సాగు సీజన్ మొదలుకావడంతో రైతుల్లో ఆందోళన
- ప్రాజెక్టు కింద రెండు తెలుగు రాష్ట్రాల్లో 16 వేల ఎకరాల ఆయకట్టు



ఇటీవల వర్షాలతో పెదవాగు ప్రాజెక్టులోకి చేరిన వరద (ఇన్‌సెట్) కొత్తగా బిగించిన గేట్ల నుంచి లీక్ అవుతున్న నీరు

అశ్వారావుపేటరూరల్: రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు గడువు దాటినా పూర్తి కావడం లేదు. నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇంజనీర్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో చేపట్టాల్సిన పనులను లష్కర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లే పర్యవేక్షిస్తున్నారు. దీంతో పనులు పూర్తవుతాయా, లేదా.. ఈసారి సాగు ఎలా అని పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది.

1975లో నిర్మాణం
అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద 1975లో పెదవాగు ప్రాజెక్టు నిర్మించారు. 21 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలోని అశ్వారావుపేటతో పాటు ఏపీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 16 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు నిర్మించి ఇప్పటికి 48 ఏళ్లు పూర్తి కాగా, మూడు గేట్లు శిథిలమై తుప్పు పట్టి భారీగా నీరు లీకేజీ అవుతోంది.


ఇంకా కొనసాగుతున్న మరమ్మతు పనులు

దీంతో వేలాది క్యూసెక్కుల వరద ఏటా గోదావరి పాలవుతోంది. సాగునీరు అందకపోవడంతో రైతులు గేట్లకు మరమ్మతులు చేపట్టాలని దశాబ్ద కాలంగా విన్నవిస్తున్నారు. ఎట్టకులకు రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల శాఖ ద్వారా ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులు సాగుతున్నాయి.


అసలే ఆలస్యం.. ఆపై జాప్యం
దశాబ్ద కాలం తర్వాత ఆయకట్టు రైతుల వినతులతో రాష్ట్ర ప్రభుత్వం పెదవాగు ప్రాజెక్టు గేట్ల మరమ్మతుకు నిధులు కేటాయించింది. ప్రాజెక్టు మూడు గేట్ల మరమ్మతులకు రూ.1.23 కోట్లు మంజూరు చేయగా.. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ టెండర్ ద్వారా పనులు దక్కించుకుంది. అదే నెలలో ఒప్పందం పూర్తయినా ఏప్రిల్ నుంచి మరమ్మతు పనులు మొదలు పెట్టారు. తొలుత తుప్పు పట్టిన గేట్లను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో కొత్త గేట్లు సిద్ధం చేశారు. ప్రస్తుతం గేట్ల తయారీ పూర్తికాగా, వారం కిందట రెండు కొత్తవి బిగించారు. మూడో గేట్ బిగించే పనులు జరుగుతున్నాయి. ఇంతలోనే వర్షాలు మొదలుకావడంతో ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరింది. దీంతో కొత్తగా బిగించిన రెండు గేట్లను కిందకు దించారు. కానీ ఈ గేట్ల ద్వారా గతంలో మాదిరిగానే నీరు లీకేజీ అవుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది.

పర్యవేక్షణ లోపం..
తుప్పు పట్టిన గేట్ల తొలగింపు, కొత్త వాటి బిగింపు పనులను ఇంజనీర్ స్థాయి అధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా ఓ వర్క్‌ఇన్‌స్పెక్టర్, లష్కర్‌కు అప్పగించారు. ఫలితంగా కాంట్రాక్టు సంస్థ కూడా నిపుణులతో కాకుండా పనులు తెలిసిన సాధారణ కార్మికులతో చేయిస్తున్నట్లు సమాచారం. కాగా, ఒప్పంద నిబంధనల ప్రకారం ఆరునెలల్లో అంటే జూన్ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా.. ఇప్పటికీ ఓ కొలిక్కి రావడంలేదు. దీంతో ఈ ఏడాది సాగుకు కూడా నీరు అందడం కష్టమేనని రైతులు వాపోతున్నారు.

చిన్నపాటి లీకేజీ ఉంది..
ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తి కావొస్తున్నాయి. గేట్ల నుంచి లీకేజీ అవుతున్న మాట వాస్తవమే అయినా.. బేస్ ఏళ్ల నాటిది కావడంతో ఇది సర్వ సాధారణమే. ఇక పనులపై పర్యవేక్షణ లోపం లేదు. ప్రత్యక్షంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షిస్తుండగా, నేను కూడా తరచుగా పరిశీలిస్తున్నాను.
–కృష్ణ, డీఈ, అశ్వారావుపేట

మెడికల్ ఇన్‌వాలిడేషన్ కార్మికుల పిల్లలకు నియామకపత్రాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు బుధవారం నియామకపత్రాలు అందజేశారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో వారికి జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య నియామకపత్రాలు అందజేశాక మాట్లాడారు. ఈ ప్రక్రియ ద్వారా ఇప్పటి వరకు సుమారు 14 వేల మందికి సంస్థలో ఉద్యోగావకాశం లభించిందని తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ కోడూరి శ్రీనివాస్, ఉద్యోగులు సుశీల్‌కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాలు అందజేస్తున్న జీఎం బసవయ్య

సింగరేణిలో అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో ఎనిమిది అధికారులను బదిలీ చేశారు. ఈమేరకు యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ముగ్గురు డీజీఎంలతోపాటు ఒక ఫైనాన్స్ మేనేజర్, నలుగురు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు ఉన్నారు. కాగా, బదిలీ అధికారులు ఈనెల 20వ తేదీలోగా నూతన స్థానాల్లో చేరాలని యాజమాన్యం ఆ ఉత్తర్వుల్లో సూచించింది.

బీటీపీఎస్‌లో ఎస్‌పీఎఫ్ హాస్టల్ ప్రారంభం

మణుగూరురూరల్: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో నిర్మించిన ఎస్‌పీఎఫ్ హాస్టల్ భవనాన్ని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న, మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావుతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ కాంతారావు, పక్కన అధికారులు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్
పినపాక: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. పినపాక మండలం మల్లారం పంచాయతీ పరిధి రాజుపేటలో ఇటీవల విద్యుదాఘాతంతో మరణించిన కార్యకర్త పూనెం విష్ణువర్ధన్ కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కు విప్ బుధవారం అందజేసి మాట్లాడారు. పార్టీకి, ప్రభుత్వానికి వారధులైన కార్యకర్తల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. ఎంపీపీ గుమ్మడి గాంధీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీశ్‌రెడ్డితో పాటు దొడ్డ శ్రీనివాసరెడ్డి, భద్రయ్య, రవిశేఖర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందే..

జేఎఫ్ఆర్ఓపీఎస్ రాష్ట్ర నాయకుడు నాగిరెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని ఓపీఎస్ పునరుద్ధరణ ఫోరం రాష్ట్ర నాయకుడు నాగిరెడ్డి పేర్కొన్నారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఫోరం ఆధ్వర్యాన ఈ నెల 23న రాష్ట్రస్థాయి సదస్సు జరగనుండగా, ఖమ్మంలోని రిక్కాబజార్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పింఛన్‌ను వర్తింపజేయడంతో పాటు ఐటీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విద్యారంగంలో ఖాళీలు భర్తీ చేయాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. కాగా, 23న హైదరాబాద్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయడంతో పాటు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలనే డిమాండ్‌తో ఈ నెల 18, 19వ తేదీల్లో నిరసనలు తెలపాలని సూచించారు. ఈ సదస్సుకు విజయ్, నాగమల్లేశ్వరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, నాయకులు సైదులు, దుర్గాభవాని, కొప్పిశెట్టి సురేశ్, పారుపల్లి నాగేశ్వరరావు, వెంగళ్‌రావు, మంగీలాల్, మన్సూర్, ప్రసాదరావు వినోద్, నాగేశ్వరరావు, మల్లయ్య, వెంకటేశ్వరరావు, రంజాన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కాలేజీ నిర్వహణకు భవనాల పరిశీలన

ఈ ఏడాది తరగతులు ప్రారంభించేలా కార్యాచరణ

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం పాలేరు నియోజకవర్గానికి బాలికల నర్సింగ్ కాలేజీని మంజూరు చేయగా, తాత్కాలికంగా తరగతుల నిర్వహణకు అనువైన భవనాలను అధికారులు గుర్తిస్తున్నారు. భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.25 కోట్లు కేటాయించింది. అయితే, స్థల కేటాయింపు, భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ ఏడాది తరగతులను ప్రారంభించేందుకు పక్కా భవనాలను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నేలకొండపల్లి మండలంలోని కోనాయిగూడెం వద్ద మూసేసిన ఓ ప్రైవేట్ పాఠశాల భవనాన్ని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు పరిశీలించి వసతులపై ఆరా తీశారు. మొత్తం 60 మంది బాలికలకు ప్రవేశాలు కల్పించనుండగా, భవనం, ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో అనువుగా ఉండదనే నిర్ధారణకు వచ్చారు. మరికొన్ని చోట్ల భవనాలను పరిశీలించి తరగతులు ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఏడాదిలోగా పక్కా భవనాల నిర్మానం పూర్తయ్యేలా టెండర్లు పూర్తిచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎంఎస్ ఈఈ టి.ఉమామహేశ్వరరావు, డీఈఈ బి.శ్రీనివాస్, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎం.డీ.వాజీద్, సైదారెడ్డి, వంగవీటి నాగేశ్వరరావు, కొండా కనకప్రసాద్, గొలుసు రవి తదితరులు పాల్గొన్నారు.


ప్రైవేట్ స్కూల్ భవనం ఆవరణలో పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తదితరులు